సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం । 18 । సెప్టెంబర్ । 2024



సోమశిలలో 50.507 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో మంగళవారానికి 50.507 టీఎంసీలు ఉన్నాయి. ఫైతట్టు నుంచి 14,300 క్యూసెక్కులు వరద వస్తుండగా పెన్నార్ డెల్టాకు 50, ఉత్తర కాలువకు 5, దక్షిణ కాలువకు 10 వేల క్యూసెక్కులు విడుదల చే స్తున్నారు.



బంగారం ధరలు


24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.75,550
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.6,855
మూడు శాతం జీఎస్టీతో	రూ.7,061
నవర (8 గ్రాములు)	రూ.56,488

గరిష్ఠం/కనిష్టం
39.6 /28.9

వాతావరణం

జిల్లాలో వాతావరణం బుధవారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం గాలిలో తేమ 36 శాతంగా నమోదైంది.

పేద వారికి వైద్య విద్య అందకుండా కుట్ర



నేను కష్టపడి చదివి ర్యాంకు తెచ్చుకున్నాను. నాకు ఎస్వీ మెడికల్ కళాశాల తిరుపతిలో ప్రభుత్వ సీటు వచ్చింది. నా కష్టంతో పాటు ప్రభుత్వ ఆధ్వర్యంలో వైద్య కళాశాలలు ఉండటమే. కేవలం రూ.10 వేలు చెల్లించి ప్రభుత్వ వైద్య విద్యను అభ్యసించగలుగుతున్నాను. అదే వైద్య కళాశాలలను ప్రైవేటీకరిస్తే కోటి నుంచి రూ.కోటిన్నర పెట్టి సీటు కొనాల్సి వస్తోంది. నేటి ప్రభుత్వం ఎన్నికలకు ముందు సెల్ఫ్ ఫైనాన్స్ విధానాన్ని వ్యతిరేకించింది. ఇప్పుడేమో గత ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించేందుకు పూనుకోవడం దారుణం. – కేతావత్ లోహిత్, నెల్లూరు, మెడికల్ విద్యార్థి



డాక్టర్ కలను చిదిమేస్తున్న కూటమి ప్రభుత్వం



నేను నీట్ రాసి 534 మార్కులు సాధించాను. ఎస్వీయూ రీజియన్‌లో గతేడాది బీసీ–ఏ విభాగంలో కటాఫ్ మార్కులు 490 మాత్రమే. ఈ సంవత్సరం నేటి ప్రభుత్వ అనాలోచిత నిర్ణయంతో కటాఫ్ మార్కులు 561గా ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రానికి ఏకంగా 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేసింది. వాటిలో 12 మెడికల్ కళాశాలలు ప్రారంభించాల్సి ఉంది. వాటిని నేటి ప్రభుత్వం ప్రారంభించకపోవడం దారుణం. పులివెందుల మెడికల్ కళాశాలలో సీట్లు వద్దని పభుత్వం ఎన్ఎంసీకి లేఖ రాయడం దుర్మార్గం. కొత్త మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరించి పేద విద్యార్థుల డాక్టర్ కలను చిదిమేస్తోంది. – పి.అస్లుధర్, బాలాజీనగర్, నెల్లూరు

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో విశ్వకర్మ జయంతి



విశ్వకర్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు (దర్గామిట్ట): కలెక్టరేట్ ప్రాంగణంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలు నిర్వహించారు. విశ్వకర్మ చిత్రపటానికి కలెక్టర్ ఓ ఆనంద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేసీ కార్తీక్, డీఆర్‌ఓ లవన్న, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన చేనేత సహకార సంఘాల ఏర్పాటు

నెల్లూరు సిటీ: జిల్లాలో నూతన చేనేత సహకార సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని జిల్లా చేనేత, జౌళిశాఖాధికారి వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీ చేనేత జౌళిశాఖ కమిషనర్ ఆదేశాల మేరకు.. కొత్తగా చేనేత సహకార సంఘాలను ఏర్పాటు చేస్తున్నామని, చేనేత రంగంలో ఉన్న చేనేత కళాకారులు వారి సభ్యత్వాన్ని నమోదు చేసుకోవాలని తెలిపారు. చేనేత సంఘాల్లో సభ్యత్వం చేసుకోవడం ద్వారా ప్రభుత్వం నుంచి వచ్చే త్రాఫ్ట్ ఫండ్ పథకం, బీమా సౌకర్యం, బ్యాంకుల ద్వారా సంఘాలకు త్రాఫ్ట్ క్రెడిట్ అర్హత, నూలు రాయితీ, ఆప్కో ద్వారా పని కల్పించడం, వస్త్రాల కొనుగోలు, వేతనాలు, వృత్తిలో శిక్షణ, సబ్సిడీ, ముద్రారుణాలు వంటి సౌకర్యాలు పొందవచ్చని తెలిపారు. కొత్త సంఘాల ఏర్పాటుకు 30 మంది సభ్యులు ఉండాలని, ఇతర వివరాలకు జిల్లా చేనేత, జౌళిశాఖ అధికారిని నేరుగా కానీ, 93932 29463, 94907 88502 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన



నెల్లూరు (అర్బన్): తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళనలు కొనసాగిస్తామని పీహెచ్‌సీల్లో పనిచేస్తున్న డాక్టర్లు స్పష్టం చేశారు. తమ నిరసనకు ప్రభుత్వం స్పందించకపోవడంతో మంగళవారం 'చలో విజయవాడ' నిర్వహించారు. విజయవాడలో జరిగే ధర్నాకు మద్దతుగా నెల్లూరు సంతపేటలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో పలువురు డాక్టర్లు ధర్నా చేశారు. ప్రభుత్వ పీహెచ్‌సీల డాక్టర్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ పీజీకోర్సులకు అవకాశం లేకుండా చేస్తున్న జీఓ నంబర్ 85ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. డాక్టర్లకు పదోన్నతులు తక్షణ మే కల్పించాలని, కనీస వేతనాలు ఇవ్వాలని, ట్రైబల్ అలవెన్స్‌లు ప్రకటించాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు తీర్చకపోతే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామన్నారు. విజయవాడ ధర్నాలో జిల్లా నుంచి 25 మంది డాక్టర్లు పాల్గొన్నారు.

కానిస్టేబుల్ ఆత్మహత్యాయత్నం

- వ్యవసాయంలో నష్టం రావడంతో అప్పుల బాధ తాళలేక..

సంగం: కానిస్టేబుల్‌గా పనిచేస్తూ.. వ్యవసాయం చేసి నష్టపోవడంతో పాటు అప్పు తీసుకున్న వారు ఇవ్వకపోవడంతో ఆ బాధతాళలేక మంగళవారం సాయంత్రం మండలంలోని పడమటిపాళెం పొలాల్లో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. పోలీసుల సమాచారం మేరకు.. విడవలూరుకు చెందిన రమేష్ ఏఎస్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇతను సంగం మండలం పడమటిపాళెం గ్రామానికి చెందిన యువతిని వివాహం చేసుకున్నాడు. దీంతో గ్రామంలో కొంత పొలాన్ని లీజుకు తీసుకుని తన భార్య సహకారంతో విధులు నిర్వర్తిస్తున్నాడు. వ్యవసాయం కోసం అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి వద్ద కొంత మేర అప్పు చేశాడు. సాగు చేసిన పొలం పెన్నా ఏటి పోరంబోకు కావడంతో గతేడాది వచ్చిన వరదలకు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయాడు. అప్పు ఇచ్చిన వ్యక్తికి తిరిగి చెల్లించేందుకు కొంత సమయం తీసుకున్నప్పటికీ సాధ్యపడకపోవడంతో మనోవేదనకు గురై తాను ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఎస్పీకి సూసైడ్ నోట్ రాసి, అందులో ఐ మిస్‌యూ అమ్మ, నాన్న అక్క అంటూ తన భార్య నిరోషా, కుమారుడు సాత్విక్, కుమార్తె నివేదితను అందరూ బాగా చూసుకోవాలని పేర్కొన్నాడు. తన దగ్గర డబ్బులు తీసుకున్న అంకిరెడ్డి, తలమంచి మల్లికార్జున తాత, బాలకృష్ణ ఇప్పటికైనా తన భార్య, పిల్లలకైనా డబ్బులు ఇవ్వాలని ఆ నోట్‌లో పేర్కొనడం గమనార్హం. అయితే స్థానికులు, కుటుంబ సభ్యులు గమనించి రమేష్‌ను బుచ్చిరెడ్డిపాళెం వైద్యశాలకు తరలించగా అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరు వైద్యశాలకు తరలించారు. సంగం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాలకుల చేతిలో ఖాకీలు బొమ్మలు

శంకరనగరంలో 14 మందిపై రౌడీషీట్లు తెరిచిన పోలీసులు





జిల్లాలో పోలీసులు పాలకుల చేతిలో 'కీలు' బొమ్మల్లా మారి రోజుకొక అరాచకానికి బాధ్యులవుతున్నారు. రాజకీయ కక్షలకు ఆజ్యం పోస్తున్నారు. చట్టం, న్యాయం విచక్షణ మరిచిన ఖాకీలు పాలకుల పాలేర్లుగా వ్యవహరిస్తున్నారు. జిల్లాలోని అనంతసాగరం మండలం శంకరనగరం ఉదంతం ఇందుకు అద్దం పడుతోంది. కర్ర ఊతం లేనిదే నడవలేని ఓ వృద్ధుడు, ఏం జరుగుతుందో తెలుసుకోలేని మానసిక రోగి, ఎక్కడో చదువుకుంటున్న విద్యార్థి.. ఇలా కేసులంటే ఏమిటో తెలియని వారిపై హత్యాయత్నం కేసులు నమోదు చేసి జైలు పాల్జేశారు. వీరంతా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కావడమే. బెయిల్ రాకుండా అడ్డుకోవడమే కాకుండా.. రెండు నెలల తర్వాత బెయిల్ తీసుకుని బయటకు వచ్చారని వారిపై ఏకంగా రౌడీషీట్లు తెరిచి పోలీస్ వ్యవస్థను అధికార పార్టీకి తాకట్టు పెట్టారు.

- వీరిలో వృద్ధుడు, మానసిక రోగి, విద్యార్థి
- ప్రమాణ స్వీకారం రోజు వైఎస్సార్‌సీపీ నేత ఇంటిపై టీడీపీ శ్రేణుల దాడి
- తిరిగి వైఎస్సార్‌సీపీ వర్గీయులు 18 మందిపై హత్యాయత్నం కేసు నమోదు
- రెండు నెలల పాటు బెయిల్ రాకుండా అడ్డుకున్న పోలీసులు
- బెయిల్‌పై బయటకు వచ్చిన వారిపై రౌడీషీట్లు
- ఆత్మకూరులో ఆనం అరాచక పాలన



ఇతని పేరు పాల వెంకటనరసారెడ్డి. 74 ఏళ్ల వయసు. అనంతసాగరం మండలం శంకరనగరం. గ్రామంలో ఆయనకు ఉన్న రెండెకరాల భూమిలో పంటలు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. స్వతహాగా గొడవలకు దూరంగా ఉండే వ్యక్తి. పైగా ఊత కర్ర సాయం లేనిదే నడవలేని వృద్ధుడు. అలాంటి రైతును అనంతసాగరం పోలీసులు రౌడీని చేశారు. గ్రామంలో జరిగిన గొడవ సమయంలో ఆయన లేకున్నా.. టీడీపీ నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, జైలుకు పంపించారు. అతను బెయిల్‌పై బయటకు వచ్చాడని రౌడీషీట్ ఓపెన్ చేశారు. ఆయనకు రౌడీషీట్ అంటే ఏమిటో తెలియదు.



ఈయన పేరు గట్టుపల్లి రామకృష్ణారెడ్డి. వయసు 62 ఏళ్లు. అనంతసాగరం మండలం శంకరనగరం. మానసిక రోగి. షుగర్ పేషెంట్. చేతి వేలు తీసేశారు. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత గ్రామంలో టీడీపీ మూకలు దాడులకు పాల్పడిన సమయంలో అక్కడికి రావడమే ఆయన తప్పయింది. టీడీపీ మూకలు ఆయన పేరు ఇరికించడంతో జైలుకు వెళ్లి వచ్చాడు. ఇప్పుడు పోలీసులు ఇతనిపై కూడా రౌడీషీట్ తెరిచారు.

వేముల జగన్ వయసు 19 ఏళ్లు. అనంతసాగరం మండలం శంకరనగరం. ఈ విద్యార్థి నెల్లూరులోని జెనెక్స్ కాలేజీలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. వడ్డెర కులానికి చెందిన ఈ విద్యార్థి తల్లిదండ్రులను చూసేందుకు ఊరికి వచ్చాడు. గొడవ జరిగే సమయంలో గ్రామంలో లేడు. కానీ టీడీపీ నేతలు ఇతన్ని కేసులో ఇరికించడంతో జైలు పాలయ్యాడు. పోలీసులు ఈ విద్యార్థిపై కూడా రౌడీగా ముద్ర వేశారు.

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: జిల్లాలో ఖాకీలు.. పచ్చ పార్టీ లైసెన్స్‌డ్ రౌడీమూకలుగా మారారు. అధికార పార్టీ రెడ్‌బుక్ రాజ్యాంగంలో భాగస్వాములవుతున్నారు. నేతల అండ చూసుకుని ప్రతిపక్ష పార్టీ నేతలు, మద్దతుదారులు, కార్యకర్తలపై తీవ్రమైన నేరారోపణ కేసులు నమోదు చేస్తున్నారు. సామాన్య పౌరులు, రైతులపై రౌడీషీట్లు ఓపెన్ చేసే దుస్సాహసానికి ఒడిగట్టారు. పోలీస్ స్టేషన్లు, కేసులంటే ఏమిటో తెలియని అమాయకులపైనే కాకుండా.. ఇళ్లల్లో ఉండే గృహిణులు, చదువుకునే విద్యార్థులపై ఏకంగా హత్యాయత్నం కేసులతో పాటు రౌడీషీట్లు తెరిచి ఫ్రెండ్లీ పోలీస్‌కు.. ఖాకీలు తిలోదకాలు ఇస్తున్నారు. అనంతసాగరం మండలం శంకరనగరంలో టీడీపీ మూకలు వైఎస్సార్‌సీపీ నేతల ఇళ్లపైకి వచ్చి దాడులు చేస్తే.. బాధితులైన 18 మందిపైనే నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేయడమే కాకుండా, ఏకంగా 14 మందిపై రౌడీషీట్లు తెరిచిన అనంతసాగరం పోలీసులు అధికార పార్టీ బానిసలని నిరూపించుకున్నారు.



అనంతసాగరం మండలంలోని శంకరనగరం గ్రామం వ్యూ

ఆనం అండతో చెలరేగిన టీడీపీ మూకలు.. అండగా నిలిచిన పోలీసులు

ఆత్మకూరు ఎమ్మెల్యే, మంత్రి ఆనం అండ చూసుకుని టీడీపీ మూకలు చెలరేగిపోయారు. వీరికి పోలీసులు అండగా నిలిచారు. చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన జూన్ 12వ తేదీన విజయోత్సవ వేడుకల పేరుతో టీడీపీ నేతలు అనంతసాగరం మండలం శంకరనగరంలో వైఎస్సార్‌సీపీ నేత పార్లపల్లి రవికుమార్‌రెడ్డి ఇంటి ముందు డీజే పెట్టి రెచ్చగొట్టే విధంగా వ్యవహరించారు. సంయమనంతో ఉండడంతో ఇంట్లో దూరి కుటుంబ సభ్యులపై మారణాయుధాలతో దాడి చేసి తలలు పగులగొట్టారు. వృద్ధులు, మహిళలపై కూడా దాడులకు తెగబడ్డారు. ఇంట్లో విలువైన వస్తువులను ధ్వంసం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతల ఇంటికి వచ్చి దాడి చేయడమే కాకుండా వారిపైనే అక్రమ కేసులు నమోదు చేయించారు. పోలీసులు 20 మంది బాధితులపైనే హత్యాయత్నం, తీవ్రమైన నేరారోపణలతో నాన్‌బెయిలబుల్ కేసులు నమోదు చేసి జైలుకు పంపించారు. దాడి చేసిన టీడీపీ వర్గీయులు 32 మందిపై ఫిర్యాదు చేస్తే కేవలం 12 మంది మీద బెయిలబుల్ కేసు నమోదు చేసి 41ఏ నోటీసులు ఇచ్చి సరిపెట్టారు.



నాగ రామసుబ్బారెడ్డి



చేతికర్ర సాయంతో నడుచుకుంటూ వస్తున్న పాల వెంకట నర్సారెడ్డి, గట్టుపల్లి రామకృష్ణారెడ్డి

బెయిల్ తెచ్చుకున్నారని.. రౌడీషీట్లు



కృష్ణతేజ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్



నాగ సునీల్ కుమార్ రెడ్డి



మారెళ్ల పెంచలయ్య



నాగ నాగేంద్రరెడ్డి

బాధితులకు బెయిల్ రాకుండా పోలీసులు రెండు నెలలు అడ్డుకున్నారు. ఎట్టకేలకు జైలు నుంచి బెయిల్‌పై బయటకు వచ్చారని వారిపై రౌడీషీట్లు ఓపెన్ చేసి రౌడీలుగా మార్చేశారు. వీరెప్పుడూ గతంలో కేసుల్లో నిందితులుగా లేరు. అయినప్పటికీ 14 మంది జీవితాల్లో చెరగని ముద్ర వేశారు. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా ఉంటూ వర్క్ ఫ్రం హోం చేస్తున్న కృష్ణతేజ, దివ్యాంగుడు నాగా సునీల్‌కుమార్‌రెడ్డి, మారెళ్ల చిన పెంచలయ్య వంటి వారితో పాటు వైఎస్సార్‌సీపీ నేతలు, సానుభూతిపరులైన పార్లపల్లి రవికుమార్‌రెడ్డి, యనమల వెంకటేశ్వర్లు, తమ్మిశెట్టి వినోద్, తమ్మిశెట్టి వెంకట శేషయ్య, కొండ్ర శ్రీనివాసులురెడ్డి 83 రోజుల పాటు జైల్లో ఉన్నారు. పార్లపల్లి జానకమ్మ, నాగా శైలజ, రాపూరు భాగ్యమ్మ, మారెళ్ల బుజ్జమ్మ (ఎస్సీ), పాల వెంకట నరసారెడ్డి, గట్టుపల్లి రామకృష్ణారెడ్డి, నాగా రామసుబ్బారెడ్డి, నాగా నాగేంద్ర రెడ్డి, మారెళ్ల పెంచలయ్య (ఎస్సీ), వంగవరపు వీరమోహన్‌రెడ్డి 23 రోజులు జైల్లో ఉన్నారు. మైనర్లు నాగా సతీష్ రెడ్డి, వేముల విష్ణుపై కూడా కేసులు పెట్టడం గమనార్హం. గ్రామంలో వైఎస్సార్‌సీపీ వీరాభిమానిగా ముద్ర వేయించుకున్న ఆటో డ్రైవర్ నాగ నాగేంద్రరెడ్డి కుటుంబాన్ని టీడీపీ నేతలు టార్గెట్ చేశారు. భయంతో ఊరొదిలి వెళ్లిపోయే పరిస్థితి నెలకొంది.

జిల్లాను స్వచ్ఛత వైపు నడిపిద్దాం



స్వచ్ఛత హీ సేవ ర్యాలీలో జేసీ కార్తీక్, కమిషనర్ సూర్యతేజ, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, అధికారులు, విద్యార్థులు

- అక్టోబరు 2వ తేదీ వరకు స్వచ్ఛత హీ సేవ
- ప్రజలందరూ భాగస్వాములు కావాలి
- జేసీ కార్తీక్ పిలుపు

నెల్లూరు (బారకాసు): జిల్లాను స్వచ్ఛత వైపు నడిపించేందుకు ప్రజలందరూ స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగస్వాములు కావాలని జేసీ కే కార్తీక్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని వీఆర్సీ క్రీడా మైదానంలో స్వచ్ఛత హీ సేవ ర్యాలీని మున్సిపల్ కమిషనర్ సూర్యతేజ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మతో కలిసి జేసీ ప్రారంభించారు. ప్రజలను చైతన్య పరుస్తూ ర్యాలీ నిర్వహించారు. గాంధీబొమ్మ సెంటర్లో గాంధీ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. జేసీ కార్తీక్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ మిషన్ ప్రారంభించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా స్వచ్ఛత హీ సేవ పేరుతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజలందరూ కూడా స్వచ్ఛందంగా ఈ కార్యక్రమాల్లో పాల్గొనాలన్నారు.

చెత్త వేస్తే జరిమానా విధిస్తాం

కమిషనర్ సూర్యతేజ మాట్లాడుతూ నెల్లూరు నగర కార్పొరేషన్ పరిధిలో చెత్తను ఎక్కడ పడితే అక్కడ వేస్తే ఇక నుంచి జరిమానా విధిస్తామన్నారు. నెల్లూరు నగరాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజలందరూ తమవంతు కృషి చేయాలన్నారు. ప్రజలందరికీ కూడా స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి స్వచ్ఛ నెల్లూరుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల సేవలు అమోఘమని, వారందరికీ చెత్త సేకరణకు పరికరాలను అందజేస్తున్నట్లు చెప్పారు. వీరిని అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా సత్కరించి గౌరవించనున్నట్లు తెలి పా రు.

గాంధీ ఆశయ సాధనకు కృషి చేయాలి

జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ మహాత్మాగాంధీ ఆశయ సాధనలో భాగంగా మన గ్రామాలు, పట్టణాలను స్వచ్ఛ గ్రామాలు, స్వచ్ఛ పట్టణాలుగా తయారు చేసేందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛత హీ సేవ కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అక్టోబర్ 2 వరకు నిర్వహించనున్న పరిశుభ్రత కార్యక్రమాలు, పచ్చదనం, పర్యావరణం, వ్యాసరచన పోటీలు, ఆరోగ్య శిబిరాల నిర్వహణ మొదలైన కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ ర్యాలీలో పంచాయతీ అధికారి సుస్మిత, జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు, డీఆర్‌డీఏ, మెప్మా పీడీలు సాంబశివారెడ్డి, రవీంద్ర, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ చైతన్య, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు వేణుగోపాల్, రసూల్‌తో పాటు పలువురు అధికారులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ నిర్లక్ష్యంతో రైతు ఆత్మహత్య

- పొలం గట్ల మధ్య వివాదం
- గత వారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పరిష్కారం కాని వైనం
- వీఆర్వో బెదిరింపులే కారణమంటున్న కుటుంబ సభ్యులు



గత వారం కలెక్టర్‌కు గ్రామసభలో భూ వివాదంపై వివరిస్తున్న కత్తి పుల్లయ్య (ఫైల్)



కత్తి పుల్లయ్య (ఫైల్)



మృతుడి భార్య, కుమార్తె

ఆత్మకూరు: సమీప రైతుతో పొలం గట్ల వివాదం పరిష్కరించకపోగా రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యం.. బెదిరింపులతో ఓ రైతు తన ఇంట్లోనే బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని నువ్వూరుపాడు పంచాయతీ మజరా అశ్వనీపురంలో మంగళవారం తెల్లవారుజామున జరిగింది. సీఐ జి గంగాధర్‌రావు, ఎస్సై ఎస్‌కే జిలానీ, మృతుడి బంధువుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కత్తి పుల్లయ్య (62)కు రెండున్నర ఎకరాల పట్టా పొలం ఉంది. అతని పొలం పక్కనే ఉన్న బత్తల వెలుగొండయ్యతో నాలుగేళ్లుగా సరిహద్దు గట్టు వివాదం కొనసాగుతోంది. ఇటీవల రీసర్వే చేసిన క్రమంలో ఇతనికి వాస్తవంగా ఉండాల్సిన రెండున్నర ఎకరాల భూమి పాసు పుస్తకాల్లో నమోదైంది. క్షేత్రస్థాయిలోనూ అంతే భూమి ఉంది. అయితే వెలుగొండయ్య తనకు చెందిన భూమి పుల్లయ్య భూమిలో కలిసి ఉందని, మరోసారి సర్వే చేయాలని పలుమార్లు గొడవ పడ్డాడు. స్థానిక వీఆర్‌ఓ సైతం పుల్లయ్యతో మాట్లాడుతూ నీకు ఎక్కువ భూమి వచ్చిందని, సర్వే చేయాల్సిందేనని ఇబ్బంది పెట్టినట్లు కుటుంబ సభ్యులకు చెప్పి వాపోయాడు. ఈ క్రమంలో గత వారం నువ్వూరుపాడు పంచాయతీలో కలెక్టర్ ఆనంద్ గ్రామసభ నిర్వహించినప్పుడు పుల్లయ్య భూవివాదం విషయంపై కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాడు. వెంటనే ఆయన సర్వేయర్‌ను కొలతలు వేయాలని ఆదేశించాడు. అయితే మూడు రోజుల క్రితం వెలుగొండయ్య పుల్లయ్య పొలంలోని మూడు టేకు చెట్లను నరికేశాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో మరో రెండు రోజుల్లో సర్వే చేయడానికి రానున్నట్లు సర్వేయర్ తెలిపాడని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఈ విషయమై ఆదివారం వారిద్దరి మధ్య గొడవ జరిగింది. ఇలా భూ వివాదం ఏళ్ల తరబడి పరిష్కారం కాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైన కత్తి పుల్లయ్య సోమవారం అర్ధరాత్రి ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు దర్యాప్తు చేయనున్నట్లు సీఐ, ఎస్సైలు తెలిపారు. కాగా పుల్లయ్య మృతి పట్ల ఆత్మకూరు ఎంఆర్‌పీఎస్ కార్యవర్గ సభ్యులు, సీపీఎం కార్యవర్గ సభ్యులు మృతదేహాన్ని సందర్శించి సంతాపం వ్యక్తం చేశారు.

సోమశిల ప్రాజెక్ట్ గేట్ల పరిశీలన

సోమశిల: జలాశయం గేట్ల నుంచి వచ్చే లీకేజీలను అరికట్టేందుకు నాగార్జునసాగర్ అండర్ వాటర్ డ్రైవర్స్ టీం సభ్యులు ఆరుగురు ప్రాజెక్ట్ అధికారులతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు క్షుణ్ణంగా ఏ ప్రదేశాల్లో లీకేజీలు వస్తున్నాయో పరిశీలించి గుర్తించారు. 17, 18 రివర్స్ స్లూయిస్, 11వ క్రస్టుగేటు వద్ద అధిక లీకేజీలు ఉన్నట్లు గుర్తించారు. ఈ లీకేజీలు అరికట్టేందుకు బుధవారం మరమ్మతులు చేపడుతున్నట్లు ప్రాజెక్ట్ డీఈ రవీంద్రప్రసాద్ తెలిపారు. ఆయన వెంట జేఈ రామ్మోహన్‌రెడ్డి ఉన్నారు.

ఐటీఐలకు ఆర్టీసీలో అప్రెంటీస్ అవకాశం

నెల్లూరు సిటీ: ఐటీఐ పూర్తి చేసిన వారికి నెల్లూరు ఆర్టీసీలో అప్రెంటీషిప్‌కు అవకాశం కల్పిస్తున్నట్లు కాకుటూరులోని ఆర్టీసీ జోనల్ శిక్షణా కళాశాల ప్రిన్సిపల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలోని పలు ట్రేడ్‌ల్లో ఉత్తీర్ణులైన వారు అక్టోబర్ 3వ తేదీలోగా ఆన్‌లైన్ వెబ్‌సైట్ www. appren ticeshipindia. gov. in ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. జిల్లాకు సంబంధించి మొత్తం 97 అప్రెంటీషిప్ ఖాళీలు ఉన్నాయన్నారు. ఇందులో డీజిల్ మెకానిక్ 66, మోటార్ మెకానిక్ 3, ఎలక్ట్రీషియన్ 15, వెల్డర్ 2, పెయింటర్ 1, మెషినిస్ట్ 1, ఫిట్టర్ 8, డ్రాఫ్ట్‌మెన్ సివిల్‌లో 1 వంతున ఖాళీలు ఉన్నట్లు వివరించారు. ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసిన కాపీలతో పాటు రెస్యూమ్, 10వ తరగతి, ఐటీఐ ఉత్తీర్ణత మార్కుల ధ్రువీకరణ పత్రాలు, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, దివ్యాంగులు అందుకు సంబంధించిన సర్టిఫికెట్, ఆధార్ జెరాక్స్‌లతో అక్టోబర్ 3వ తేదీలోగా ప్రిన్సిపల్, జోనల్ స్టాఫ్ ట్రైనింగ్ కళాశాల, కాకుటూరు, వెంకటాచలం మండలం, నెల్లూరు జిల్లా-524320 చిరునామాకు పోస్ట్‌ద్వారా పంపాలని తెలిపారు. అభ్యర్థుల ఎంపికకు నిర్వహించే ఇంటర్వ్యూకు సంబంధించి తేదీలను తెలియజేస్తామని తెలిపారు. అభ్యర్థులు రూ.100 ఫీజుతో పాటు, రూ.18 జీఎస్టీతో కలిపి రుసుం చెల్లించాల్సి ఉంటుందని, వివరాలకు కార్యాలయంలో నేరుగా కానీ, 91542 91408 నంబరులో కానీ సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

బీసీ కాలనీ వాసులను ఆదుకోండి

• కలెక్టర్‌కు మాజీ మంత్రి కాకాణి లేఖ



నెల్లూరు(బారకాసు): సర్వేపల్లి నియోజకవర్గం మనుబోలు గ్రామంలోని బీసీ కాలనీలో వినాయకుని నిమజ్జనం సందర్భంగా బాణసంచా ప్రమాదంతో బీసీ కాలనీలో విషాదఛాయలు అలుముకున్నాయని మాజీ మంత్రి కాకాణి పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం కలెక్టర్‌కు లేఖ రాశారు. బీసీ కాలనీలో జరిగిన సంఘటనను ఆయన పరిశీలించారు. కాలనీలో దెబ్బతిన్న ఇళ్ల మరమ్మతులకు, గాయపడిన వారికి మెరుగైన చికిత్స అందించడంతో పాటు, ప్రాణాలు కోల్పోయిన బాలుడి కుటుంబానికి నష్టపరిహారం అందించేందుకు తక్షణమే తగు చర్యలు తీసుకోవాల్సిదిగా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


మాల్యాద్రి (ఫైల్)

ఉదయగిరి: వరికుంటపాడు మండలం జి.కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన కుమ్మిత మాల్యాద్రి (47) అనే రైతు అప్పుల బాధ తాళలేక పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతునికి నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో వివిధ రకాల పంటలు సాగు చేస్తూ రూ.20 నుంచి రూ.30 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పు తీర్చాలంటూ ఒత్తిడి పెరగడంతో ఈ నెల 12వ తేదీ పురుగుమందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఓ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అయితే వైద్యఖర్చులు భరించే స్తోమత లేకపోవడంతో మరుసటిరోజు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్యతో పాటు ఇద్దరు పిల్లలున్నారు. కుటుంబ యజమాని ఆత్మహత్యకు పాల్పడటంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది.

రూ.లక్ష పలికిన వేలం లడ్డూ ధర

కందుకూరు: వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో వైభవంగా సాగుతున్నాయి. చివరి రోజుల్లో నిమజ్జనాలు, లడ్డూ వేలం పాటలతో సందడి వాతావరణం నెలకొంటుంది. మంగళవారం పట్టణంలోని రాళ్లవీధిలోని బ్రహ్మంగారి దేవస్థానం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద లడ్డూ వేలంపాట నిర్వహించగా ఉత్సవాల నిర్వాహకులు, కందుకూరు విశ్వబ్రాహ్మణ అధ్యక్షుడు వడ్లమాని శేఖర్ రూ.లక్షకు లడ్డూను దక్కించుకున్నారు. అనంతరం 1500 మందికి అన్నదానం నిర్వహించారు.

మండుతున్న ఎండలు విలవిలలాడుతున్న ప్రజలు

కావలి: జిల్లాలో ఎండల ప్రతాపంతో జనం విలవిల్లాడుతున్నారు. ఉక్కపోత, పడమటి గాలులతో వృద్ధులు, పిల్లలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. మంగళవారం ఉదయం ఎనిమిది గంటల నుంచే ఎండ తీవ్రత కనిపించింది. ఆగస్టు నెల చివరి వారంలో ఏర్పడిన అల్పపీడనం తర్వాత నుంచి వాతావరణంలో తేమ శాతం గణనీయంగా పడిపోయింది. దీంతో ఉష్ణోగ్రతలు ఎండాకాలం లాగే నమోదు అవుతున్నాయి. ఈ నెల 11వ తేదీ 37 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత నమోదు కాగా, 12వ తేదీ 38, 13న 38.1, 14న 37, 15న 37.6, 16న 38.1 సెంటీగ్రేడ్ నమోదు కాగా 17వ తేదీన 39.6 డిగ్రీల సెంటీగ్రేడ్ నమోదయింది. వేడిగాలుల ప్రభావంతో ప్రజలు రోడ్లపై రాకపోకలు సాగించాలంటేనే భయపడుతున్నారు. ఎండలు పెరగడంతో రోజువారీ విద్యుత్ వినియోగం విపరీతంగా పెరుగుతోందని విద్యుత్ అధికారుల చెబుతున్నాయి.

చెట్టుకొమ్మ విరిగిపడి ఆర్టీసీ డ్రైవర్ మృతి



శ్రీరాములు మృతదేహం

కోవూరు: ఆర్టీసీ డ్రైవర్ నావూరు శ్రీరాములు చెట్టుకొమ్మ విరిగి తలపైన పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటన పడుగుపాడు ఆర్టీసీ వర్క్ షాప్ దగ్గర మంగళవారం మధ్యాహ్నం జరిగింది. వివరాల్లోకి వెళితే.. తిరుపతి జిల్లా నారాయణవనం మండల పరిధిలోని కృష్ణంరాజు కండ్రిగలో నివాసం ఉంటున్న శ్రీరాములు పుత్తూరు ఆర్టీసీ డిపోలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన నడుపుతున్న బస్సుకి అద్దం పగలడంతో వర్క్ షాప్‌లో రిపేరు కోసం వచ్చాడు. ఆయన తిరిగి వెళ్లాల్సిన బస్సు వచ్చేందుకు సమయం ఉండటంతో ఈలోగా వర్క్ షాప్ బయట ఉన్న చెట్టు కింద పడుకుని విశ్రాంతి తీసుకుంటున్నాడు. అదే సమయంలో చెట్టు కొమ్మ విరిగి శ్రీరాములు తలపై పడడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందారు. కోవూరు ఎస్ఐ రంగనాథ్ గౌడ్ సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకొన్నారు. మృతదేహాన్ని పోస్ట్ మార్టం నిమిత్తం కోవూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు.




ప్రభుత్వ వైఖరి మారాలి

పేద విద్యార్థులను వైద్య విద్యకు దూరం చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. నీట్లో ర్యాంకులు సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు వైద్య విద్యను ప్రభుత్వ కళాశాలల్లో చదవకుండా అడ్డుకట్ట వేస్తోంది. రాష్ట్రంలో కొత్త మెడికల్ కళాశాలలు వద్దని రాష్ట్ర ప్రభుత్వం లేఖలు రాయడం విచారకరం. ఎంతో మంది పేద విద్యార్థులు నీట్‌లో ర్యాంకులు సాధించి వైద్య కళాశాలల్లో అడ్మిషన్లు పొందేందుకు సిద్ధంగా ఉన్న తరుణంలో ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్న తప్పుడు నిర్ణయం విద్యార్థులకు శాపంగా మారింది. – కందుకూరు సుబ్బారాయుడు, నీట్ విద్యార్థిని తండ్రి



రూ.లక్షలు పెట్టి చదవలేం



మధ్యతరగతి కుటుంబానికి చెందిన మేము రూ.లక్షలు ఖర్చు పెట్టి చదువుకోలేము. వైఎస్ జగన్ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేసి నిర్మించిన వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రారంభించకపోవడం బాధాకరం. కళాశాల సీట్ల మంజూరు విషయంలో చంద్రబాబు ధోరణి మార్చుకోవాలి. సీట్లు వద్దని తాను రాసిన లేఖను వెనక్కి తీసుకోవాలి. కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ సీట్లను రాష్ట్రానికి కేటాయించాలి. డాక్టర్ చదవాలన్నది నా ఆకాంక్ష. – జోగి లాస్య, విద్యార్థిని

సంక్షోభంలో చెరకు సాగు

జిల్లాలో చెరకు సాగు సంక్షోభంలో ఉంది. తీపిని పంచే చెరకు చేదెక్కి రైతులకు ఆవేదన మిగిల్చింది. చెరకు సాగుకు పెట్టుబడులు అధికం అవుతున్నా ఫ్యాక్టరీల నుంచి గిట్టుబాటు ధర లభించకపోవడంతో సాగు విస్తీర్ణం గణనీయంగా తగ్గుముఖం పట్టింది. రాయితీలు అందించకపోవడం, రైతులకు ఫ్యాక్టరీలు బకాయిలను సకాలంలో చెల్లించలేక పోవడంతో సాగు బాగా తగ్గిపోయంది.

- జిల్లాలో గణనీయంగా తగ్గిన విస్తీర్ణం
- కేవలం 21 ఎకరాల్లోనే సాగు
- ఉన్న మూడు ఫ్యాక్టరీలు మూసివేత
- తెరిపించేందుకు అధికారుల ప్రయత్నాలు


సాగులో ఉన్న చెరకు తోట

గతంలో చెరకు సాగు	20 వేల ఎకరాలు
ప్రస్తుతం చెరకు సాగు	21 ఎకరాలు
గతంలో షుగర్ ఫ్యాక్టరీలు	3 (మూసివేశారు)
మూడు ఫ్యాక్టరీల క్రషింగ్ సామర్థ్యం	6.50 లక్షల టన్నులు

పొదలకూరు: చెరకు సాగు లాభసాటిగా లేకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయంగా వరిసాగు వైపునకు మారారు. దశాబ్ద కాలం నుంచి చెరకు సాగు తగ్గుతూ వచ్చింది. జిల్లాలో ఉన్న మూడు


మూతపడిన సూదలగుంట షుగర్ ఫ్యాక్టరీ

ఫ్యాక్టరీలు మూతపడటంతో చెరకు సాగు దాదాపుగా కనుమరుగయ్యింది. స్వల్పంగా అక్కడక్కడా సాగు చేస్తున్న చెరకు కూడా నగరాల్లో చెరకు రసం తీసి అమ్ముకునే షాపులకు వెళుతోంది. గతంలో ఉమ్మడి నెల్లూరు జిల్లాలో నాయుడుపేట ఎంపీ షుగర్స్, పొదలకూరు మండలం పీజీపట్నం పంచాయతీ సూదలగుంట షుగర్స్, కోవూరు సహకార షుగర్స్ జోన్లలో 20 వేల ఎకరాల్లో చెరకు సాగయ్యేది. మూడు షుగర్ ఫ్యాక్టరీలు ఒకటొకటిగా ఒకటి, రెండేళ్ల తేడాతో మూతపడ్డాయి. మూడేళ్ల క్రితం పొదలకూరు సూదలగుంట షుగర్స్ మూతపడింది. దీంతో దశాబ్ద కాలంలో జిల్లాలో చెరకు సాగు లేకుండా పోయింది.

భారంగా మారిన సాగు

చెరకు సాగు భారంగా రైతులకు భారంగా మారింది. గతంలో సూదలగుంట షుగర్స్ యాజమాన్యం రైతులతో సమావేశం నిర్వహించకుండానే టన్ను చెరకు మద్దతు ధర రూ.2,750గా ప్రకటించింది. అయితే రూ.3,500 టన్ను చెరకు మద్దతు ప్రకటించాలని రైతులు విజ్ఞప్తి చేశారు. రైతులు వ్యవసాయ ఖర్చులు, మద్దతు ధరలను బేరీజు వేసుకుంటే సాగు లాభదాయకంగా లేదంటున్నారు. రైతు ఎకరం పొలంలో చెరకును పండించాలంటే రూ.45 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. చెరకును కొట్టే కూలీలకు కూడా రైతులే చెల్లిస్తున్నారు. ఎకరానికి 40 టన్నులకు మించి దిగుబడి రాదు. తోలిన చెరకు డబ్బుల కోసం రైతులు ఫ్యాక్టరీల చుట్టూ తిరగాల్సి ఉంటుంది. దీనికితోడు ఎలాంటి ప్రోత్సాహకాలు లేకపోవడంతో రైతులు చెరకు విస్తీర్ణాన్ని తగ్గించారు. సూదలగుంట ఫ్యాక్టరీ యాజమాన్యం తీరు నచ్చక జోన్ పరిధిలోని 12 మండలాల రైతులు సీజన్‌లో 2.50 లక్షల టన్నుల చెరకు పండించాల్సి ఉండగా కేవలం 15 వేల టన్నులతో సరిపెట్టడం వల్ల ఫ్యాక్టరీ నష్టాలను చవిచూడాల్సి వచ్చింది. సూదలగుంట షుగర్స్ యాజమాన్యం చెరకు తోలిన రైతులకు రూ.8 కోట్లు, చెరకు కొట్టిన లేబర్‌కు రూ.కోటి, ఉద్యోగుల జీతాలు రూ.2 కోట్లు బకాయిలు పెట్టి లాక్‌అవుట్ ప్రకటించింది. దీంతో ఇక్కడ పెద్ద యుద్ధమే జరిగింది. తర్వాత కలెక్టర్ కలగజేసుకుని కేన్ కమిషన్, రెవెన్యూ అధికారులు కలసి ఆర్‌ఆర్ యాక్ట్ ప్రయోగించి రైతులకు బకాయిలు ఇప్పించారు. ప్రస్తుతం రూ.3 కోట్లు పైబడి బకాయిలు ఇంకా చెల్లించాల్సి ఉంది.

షుగర్ ఫ్యాక్టరీ తెరిపించే ప్రయత్నాలు

పొదలకూరుకు సమీపంలోని సూదలగుంట షుగర్ ఫ్యాక్టరీ తెరచుకునే ప్రయత్నాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. యాజమాన్యం రూ.3 కోట్ల బకాయిలను చెల్లించి ఫ్యాక్టరీని పునఃప్రారంభించేందుకు కసరత్తు చేస్తున్నట్టు తెలిసింది. ఇందుకోసం కలెక్టర్, కేన్ కమిషన్‌ను కలిసినట్టు తెలుస్తోంది. ఫ్యాక్టరీ తెరచుకోవడం మంచి పరిణామం అయినప్పటికీ రైతులు యాజమాన్యాన్ని నమ్మి చెరకు సాగు చేస్తారా అన్నదే ప్రశ్న. తిరిగి ఫ్యాక్టరీని ప్రారంభిస్తే కొంత వరకు నిరుద్యోగ సమస్య తీరడంతో పాటు ఉద్యోగాలు కోల్పోయిన వారు తిరిగి చేరే అవకాశం కూడా ఉంటుంది.

పాత బకాయిలు ఇప్పించాలి



సూదలగుంట ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి ఇంకా రైతులకు బకాయిలు రావలసి ఉంది. గత అనుభవాలతో చెరకు సాగు జోలికి వెళ్లాలంటే రైతులు భయపడుతున్నారు. వారిని సాగుకు ఒప్పించే బాధ్యత ప్రభుత్వమే తీసుకోవాలి. మద్దతు ధరపై కూడా ప్రభుత్వం హామీ ఇస్తేనే గాని రైతులు చెరకు సాగకు ముందుకు వచ్చే పరిస్థితి లేదు.
– కండ్లకూటి రమణారెడ్డి, చెరకు రైతు, మహ్మదాపురం

చాలా వరకు చెల్లించాం



సూదలగుంట ఫ్యాక్టరీ యాజమాన్యంపై ఆర్ ఆర్ యాక్ట్ ప్రయోగించి రైతుల బకాయిలు చాలావరకు చెల్లించాం. రూ.13 కోట్లు ఉన్న బకాయిలను రూ.3 కోట్లకు తీసుకు రావడం జరిగింది. ఫ్యాక్టరీ యాజమాన్యం తిరిగి పునఃప్రారంభించేందుకు కసరత్తు చేస్తోంది. నెలరోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.
– జాన్‌విక్టర్, ఇన్‌చార్జ్ అసిస్టెంట్ కేన్ కమిషన్, నెల్లూరు

ప్రభుత్వ భూమి ఆక్రమణకు యత్నాలు

- కూటమి ప్రభుత్వంలో తమ్ముళ్ల హవా
- రాత్రిళ్లు చదును చేస్తున్న వైనం


కంపసముద్రంలో ఆక్రమించేందుకు చదును చేసిన భూమి

మర్రిపాడు: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి కాలేదు. కానీ ప్రభుత్వ అండతో తెలుగు తమ్ముళ్లు కనిపించిన చోటల్లా ప్రభుత్వ భూమిని చదును చేసి ఆక్రమించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మర్రిపాడు మండలంలోని కంపసముద్రం గ్రామంలోని సర్వే నెం.446, 447, 447, 449లలో సుమారు 100 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూమిలో రాత్రి సమయాల్లో జేసీబీలతో చదును చేసే పనులకు తెలుగు తమ్ముళ్లు శ్రీకారం చుట్టారు. పగటిపూట పనులు చేయకపోవడంతో స్థానికులకు కొన్నాళ్లు అర్థం కాలేదు. కానీ రానురాను భూమి చదును చేస్తున్న ప్రాంతం పెరుగుతూ వస్తుండడంతో ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతుందన్న విషయం గ్రహించారు. అదే విధంగా మండలంలోని ఈర్లపాడు గ్రామంలో కూడా ప్రభుత్వ భూములను టీడీపీ నాయకులు చదును చేస్తున్నారు. గతంలో మండలంలోని నందవరం రెవెన్యూలో ఆక్రమణల విషయం మీడియాలో రావడంతో అధికారులు అక్కడ చర్యలు తీసుకున్నారు. టీడీపీ నాయకులు భూఆక్రమణలపై తహసీల్దారు స్వప్నను వివరణ కోరగా ఎవరైనా భూఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో మా దృష్టికి వచ్చిన చోట భూములను పరిశీలించి హెచ్చరిక బోర్డులను సైతం ఏర్పాటు చేశామన్నారు.

ఒక్క మాత్రతో నులిపురుగుల నివారణ


విద్యార్థి చేత నులిపురుగుల మాత్రలను మింగిస్తున్న డీఎంహెచ్ఓ పెంచలయ్య తదితరులు

నెల్లూరు(అర్బన్): ఆల్‌బెండజోల్ ఒక్క మాత్రను తీసుకోవడం ద్వారా పొట్టలోని నులిపురుగులను నివారించవచ్చని డీఎంహెచ్ఓ పెంచలయ్య అన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని మంగళవారం నగరంలోని మద్రాస్‌బస్టాండ్ వద్ద ఉన్న సుంకు చెంగన్న స్కూలులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 నుంచి 2 ఏళ్లలోపు పిల్లలకు ఆల్‌బెండజోల్ 200 మి.గ్రా మాత్ర, 3 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలకు 400 మి.గ్రా మాత్ర వేయాలన్నారు. పరిశుభ్రత లేనప్పుడు మట్టిలోని నులిపురుగులు శరీరంలోనికి ప్రవేశిస్తాయన్నారు. నులిపురుగుల వల్ల రక్తహీనత ఏర్పడుతుందన్నారు. ఆకలి మందగిస్తుందన్నారు. చురుకుదనం కోల్పోయి నీరసంగా ఉంటారన్నారు. అందువల్ల తప్పనిసరిగా నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్నం భోజనం తర్వాత మాత్ర వేసుకోవాలన్నారు. జిల్లాలోని అన్ని పాఠశాలల్లో 5,42,684 మంది పిల్లలకుగాను 5,13,921 మందికి మాత్రలు వేశామన్నారు. 94.71 లక్ష్యాన్ని చేరుకున్నామన్నారు. హాజరు కాని పిల్లలకు ఈనెల 25వ తేదీన మళ్లీ మాత్రలు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలి, ఆర్‌బీఎస్కే కో ఆర్డినేటర్ డాక్టర్ సుధీర్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలి



లబ్ధిదారుకు ఇంటి తాళాలను అందజేస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(దర్గామిట్ట): జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ్ 2.0 పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలను వెంటనే పూర్తి చేయాలని కలెక్టర్ ఆనంద్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఒడిశా రాష్ట్రంలోని భువనేశ్వర్‌లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద నిర్మించిన గృహాలను ప్రధానమంత్రి నరేంద్రమోడి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. నెల్లూరు కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ జిల్లాలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కార్యక్రమం కింద నిర్మించిన 2,573 గృహాలను పూర్తి చేసి లబ్ధిదారులకు అప్పగించడం జరిగిందన్నారు. జిల్లాలోని 11 మండలాల్లో 60 మంది లబ్ధిదారులకు కొత్తగా ప్రధానమంత్రి ఆవాస్ యోజన కార్యక్రమం కింద 56 మంది లబ్ధిదారులకు గృహ నిర్మాణ మంజూరు పత్రాలు పంపిణీ చేశామన్నారు. గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులకు ఇంటి తాళాలను కలెక్టర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ దయాకర్, టిడ్కో ఎస్ఈ జాన్ సైమన్, కావలి గృహ నిర్మాణశాఖ ఈఈ మాధవరావు, డీఈఈ డీ వెంకటేశ్వర్లు, అసిస్టెంట్ ఇంజనీర్లు మాధవయ్య, రామారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం


విస్తీరాణి మృతదేహం

ఉదయగిరి: ఉదయగిరి పట్టణంలోని గాజులవీధికి చెందిన విస్తీరాణి అనే వివాహిత మంగళవారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు వింజమూరుకు చెందిన సయ్యద్ షరీఫ్ పార్వతీపురం జిల్లా వీరఘట్ట మండలం హాసేన్‌పురం గ్రామానికి చెందిన తోట విస్తీరాణిని (23) ఏడాది క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి రెండు నెలల పాప ఉంది. ఈ క్రమంలో షరీఫ్‌కు మొలల వైద్యం చేసే వృత్తి తెలిసి ఉండటంతో నెలరోజుల క్రితం ఉదయగిరి వచ్చి ఓ అద్దె ఇంట్లో కాపురముంటూ మొలల వైద్యం చేస్తున్నాడు. మంగళవారం మధ్యాహ్నం విస్తీరాణి పాపను వరండాలో పడుకోబెట్టి స్నానం చేసేందుకు బాత్‌రూముకు వెళ్లింది. ఈ లోగా షరీఫ్ బయటకు వెళ్లి కొంతసేపటికి తిరిగి ఇంటికి వచ్చాడు. పాప ఉయ్యాలలో నిద్రపోతుండటం, స్నానం చేసేందుకు గదిలోకి వెళ్లిన భార్య బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి పక్కింటివారి సాయంతో తలుపులు తీసేందుకు ప్రయత్నించగా రాకపోవడంతో సన్‌షేడ్ ఎక్కి కిటికీలోనుంచి తొంగిచూడగా ఫ్యానుకు ఉరేసుకొనివుంది. వెంటనే షరీఫ్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై శ్రీనివాసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని కిందికి దింపి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియలేదు. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి వృద్ధుడి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): కుటుంబ కలహాలో? మరే ఇతర కారణమో స్పష్టంగా తెలియదుకానీ గుర్తుతెలియని వృద్ధుడు రైలుకింద పడి బలవన్మరణం చెందాడు. ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున నెల్లూరు సౌత్ రైల్వేస్టేషన్ సమీపంలో నెల్లూరు వైపు వచ్చే రైలు పట్టాలపై చోటుచేసుకుంది. మృతుడు సుమారు 50 నుంచి 55 ఏళ్లలోపు వయసు కల్గి, నలుపురంగుపై బులుగు గళ్లు కల్గిన ఫుల్‌హ్యాండ్స్ చొక్కా, గ్రే రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. ప్రమాద ఘటనపై సమాచారం అందుకున్న నెల్లూరు రైల్వే ఎస్ఐ జి.మాలకొండయ్య సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి జీజీహెచ్ మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతుని వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)



పెద్దవి	రూ.100
సన్నవి	రూ.50
పండ్లు	రూ.35

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ లైవ్	రూ.127
లేయర్ లైవ్	రూ.115
బ్రాయిలర్ చికెన్	రూ.230
స్కిన్‌లెస్ చికెన్	రూ.254
లేయర్ చికెన్	రూ.195